# ఆగిన దళితబంధు

## పట్టించుకోని కొత్త ప్రభుత్వం.. ముందుకు కదలని పథకం



దళితబంధు యూనిట్లతో లబ్ధిదారులు(ఫైల్)

## కేసీఆర్ ప్రభుత్వంలో ఎస్సీలకు రూ.10 లక్షల ఆర్థిక సాయం

- గతేడాది రెండో విడుత ప్రక్రియ ప్రారంభం
- ఉమ్మడి జిల్లాలో 13,200 మందికి కేటాయింపు
- 240మందికి యూనిట్లు సైతం మంజూరు
- ఆశగా ఎదురుచూస్తున్న దరఖాస్తుదారులు
- తొలి విడుతలో జిల్లాలో 413 మందికి దళిత బంధు
- వాసాలమర్రిలో మారిన ఎస్సీల జీవితాలు
- నెలకు రూ.30 వేల నుంచి 50 వేల దాకా ఆర్జన

**దళితుల ఆర్థిక పురోభివృద్ధికి గత కేసీఆర్ ప్రభుత్వం తీసుకొచ్చిన దళితబంధు పథకం ఆగిపోయింది. కొత్త ప్రభుత్వం అధికారంలోకి రావడంతో యథావిధిగా అమలు చేయకుండా స్కీమ్‌ను పక్కనబెట్టింది. గతేడాది జూలైలో ప్రభుత్వం రెండో విడుత దళితబంధును ప్రారంభించింది. ఉమ్మడి జిల్లాలో 13,200 మందికి ఇవ్వాలని నిర్ణయించారు. దరఖాస్తుల స్వీకరణ, ఎంపిక ప్రక్రియ కూడా జరిగింది. 240 మందికి యూనిట్లు సైతం మంజూరయ్యాయి. కానీ, కొత్త ప్రభుత్వం దాన్ని కొనసాగించకుండా కాలయాపన చేస్తున్నది.**

–యాదాద్రి భువనగిరి, జనవరి 2(నమస్తే తెలంగాణ)

ఒకప్పుడు దళితులకు పని దొరకడమే కష్టమయ్యేది. ఏదో దొరికిన పనితో కూలినాలి చేసుకునే పరిస్థితి, కుటుంబాన్ని ఏ పూటకు ఆ పూట వెళ్లదీసే దుస్థితి. అనేక సందర్భాల్లో అప్పులపాలై కుటుంబాలే ఆగమైన దయనీయ సంఘటనలు. వీటన్నింటినీ పటాపంచలు చేసేలా గత కేసీఆర్ సర్కారు దళిత బంధు పథకానికి శ్రీకారం చుట్టింది. దేశంలో ఎక్కడా లేని విధంగా దళితుల దశ మారి వారి జీవితాల్లో వెలుగులు నింపేలా గొప్ప కార్యక్రమానికి నాంది పలికింది. ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు చర్యలు చేపట్టింది. ఈ పథకం కింద ఒక్కో దళిత కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సాయాన్ని అందించింది. రాష్ట్ర వ్యాప్తంగా తొలి విడుత సమర్థవంతంగా అమలు చేసి చూపించింది. కూలీలు, చిరుద్యోగులు అరకొర జీతాలకు పని చేసిన దళితులు ఓనర్లయ్యారు. మంచి వ్యాపారాలు చేసి లక్షాధికారులయ్యారు.

### రెండో విడుతలో 13,200 యూనిట్లు..

తొలి విడుత విజయవంతంగా ముగియడంతో గత ప్రభుత్వం రెండో విడుతకు ప్రణాళిక చేపట్టింది. అందులో భాగంగా నియోజకవర్గానికి 1,100 మంది ఎస్సీలకు యూనిట్లు పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 13,200 మంది ఎస్సీలకు దళిత బంధు యూనిట్లు కేటయించారు. ఇందుకు రూ.1,320 కోట్ల దాకా నిధులు ఖర్చు చేసేందుకు అనుమతి ఇచ్చింది. యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా రూ. 300 కోట్లతో 3వేల మంది వరకు దళిత బంధు ఇవ్వాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించి అధికారులు కసరత్తు కూడా ప్రారంభించారు. నియోజకర్గాల వారీగా నోడల్ అధికారులను నియమించారు. అర్హుల ఎంపిక ప్రక్రియ షురూ చేశారు. భువనగిరి, ఆలేరు నియోజకవర్గాలతోపాటు మునుగోడు, తుంగతుర్తి నియోజకవర్గాల్లో రెండు మండలాల చొప్పున, నకిరేకల్‌లోని రామన్నపేట మండలం నుంచి పెద్ద ఎత్తున దరఖాస్తులు పెట్టుకున్నారు. ఎంపిక ప్రక్రియ ప్రారంభించారు. ఎమ్మెల్యేలు సైతం అర్హుల జాబితాను అధికారులకు అందించారు. ఇందుకు సంబంధించి జిల్లాలో అధికారులు 240 మందికి యూనిట్లు సైతం మంజూరు చేశారు.

### నల్లగొండ జిల్లాలో..

నల్లగొండ : జిల్లాలో దళితబంధు తొలి విడుతలో 517 మందికి రూ.10 లక్షల చొప్పున నిధులు ఇచ్చిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం రెండో విడుతలో నియోజకవర్గానికి 1,100 మందికి ఇస్తామని ప్రకటించి అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ప్రకటించింది. ఈ నేపథ్యంలో జిల్లాలో ఎన్నికలకు ముందే 1,058 మంది కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకోగా ఎస్సీ కార్పొరేషన్ యంత్రాంగం వారి పేర్లు ఆన్‌లైన్ చేసింది. ఆన్‌లైన చేసిన వారికి నల్లగొండ నియోజక వర్గంలో అప్పటి ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ కూడా ఇచ్చి గ్రౌండింగ్ చేసే సమయంలో ఎన్నికల కోడ్ రావడంతో ఆ పథకం ఆగిపోయింది. ప్రస్తుతం కొత్త ప్రభుత్వం కొలువు దీరిన తర్వాత ఆ పథకాన్ని పూర్తిగా ఆపాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించడంతో లబ్ధిదారుల ఆశలు నీరుగారుతున్నాయి.

### పట్టించుకోని కొత్త సర్కారు..

ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అప్పటి నుంచి దళితబంధు అమలుపై ఒక్క అడుగు కూడా ముందుకు పడడం లేదు. రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి శాఖను ఎవరికీ కేటాయించలేదు. ఈ శాఖ సీఎం రేవంత్‌రెడ్డి వద్దనే అంటిపెట్టుకున్నారు. ఇప్పటికే మంజూరైన యూనిట్లను సైతం అమలు చేయకుండా నిలిపేయడంపై దరఖాస్తుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దళితబంధు ఎప్పుడు వస్తుందా? అని ఆశగాఎదురుచూస్తున్నారు. అధికారులు మాత్రం తమకు సర్కారు నుంచి ఆదేశాలు రాలేదని స్పష్టం చేస్తున్నారు.

### తొలి విడుతలో 412 మందికి..

దళిత బంధు పథకాన్ని తొలుతగా రాష్ట్రంలోని యాదాద్రి భువనగిరి జిల్లాలో అమలు చేశారు. నాటి సీఎం కేసీఆర్ దత్తత గ్రామం తుర్కపల్లి మండలం వాసాలమర్రిలో పైలెట్ ప్రాజెక్ట్ కింద ప్రారంభించారు. గ్రామంలోని 75 మంది ఎస్సీ కుటుంబాలకు దళితబంధు అమలు చేశారు. ఇక తొలి విడుతలో జిల్లా వ్యాప్తంగా 412 మందికి దళిత బంధు డబ్బులు గ్రౌండింగ్ అయ్యాయి. ఇందులో భువనగిరి నియోజకవర్గంలో 100 మందికి, ఆలేరులో 175 మందికి, మునుగోడులో 61 మందికి, నకిరేకల్‌లో 39 మందికి, తుంగతుర్తిలో 38 మందికి దళిత బంధు యూనిట్లు పంపిణీ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన సాయంతో ల్యాబ్, వెల్డింగ్, కిరాణా, మెడికల్ సామగ్రి డీలర్‌షిప్, ప్లాస్టిక్ ప్లేట్లు, క్లాస్ షోరూమ్, సెంట్రింగ్, టీ కప్పుల తయారీ తదితర వ్యాపారాలు ఏర్పాటు చేసుకున్నారు. సొంతంగా నెలకు రూ.30 వేల నుంచి రూ.50 వేల దాకా సంపాదిస్తున్నారు. వాళ్లు పని చేయడంతోపాటు మరికొందరికి ఉపాధి కల్పిస్తున్నారు.

### సూర్యాపేట జిల్లాలో 67 కుటుంబాలవి ఫ్రీజ్

సూర్యాపేట, జనవరి 2 (నమస్తే తెలంగాణ) : దళితులు ఆర్థికంగా నిలదొక్కుకోవాలనే ఉద్దేశంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన దళిత బంధు వేలాది కుటుంబాల్లో వెలుగులు నింపింది. అయితే రెండో విడుతలో జిల్లా వ్యాప్తంగా 4,400 కుటుంబాలకు ఈ పథకం వర్తింపజేయాలనే ఉద్దేశంతో జాబితా సిద్ధంగా కాగా, అసెంబ్లీ ఎన్నికలతో స్కీమ్ ప్రాసెసింగ్ నిలిచిపోయింది. సూర్యాపేట నియోజకవర్గంలో 58 కుటుంబాలకు తొలి విడుత 2 లక్షల చొప్పున రూ.1.16 కోట్లు విడుదలై లబ్ధిదారుల అక్కౌంట్లలో జమయ్యాయి. అలాగే తిరుమలగిరి మండలంలో 9 మంది మృతి చెందడంతో వారి నామినీ అక్కౌంట్లలో రూ.89.10 లక్షలు జమయ్యాయి. అసెంబ్లీ ఎన్నికల కారణంగా ఆయా అక్కౌంట్లు ఫ్రీజ్ కాగా నెల రోజులుగా లబ్ధిదారులు తమ డబ్బులు ఎప్పుడు విడుదలవుతాయోనని ఎదురుచూస్తున్నారు.

# ధరణి నిలిపివేత?

- రెండు రోజులుగా తెరుచుకోని సిటిజన్ లాగిన్
- బుక్ కాని స్లాట్‌లు.. అయోమయంలో రైతులు
- మాడ్యూల్స్ చెకింగ్ తాత్కాలికంగా ఆగిందంటున్న అధికారులు

పెద్దఅడిశర్లపల్లి, జనవరి 2 : ధరణి నిలిపివేత దిశగా కొత్త ప్రభుత్వం అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తున్నది. ఇప్పటికే ధరణికి ప్రత్యామ్నాయంగా తీసుకొచ్చే భూమాత పేరు మార్పిడితోపాటు ధరణిలో మాడ్యూల్స్ మార్పిడిపై సాంకేతిక బృందం కసరత్తు చేస్తున్నది. ప్రస్తుతం ధరణిలో భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియ తప్ప మిగతా పనులు అధికారులు పూర్తిగా నిలిపివేయగా తాజాగా రెండు రోజుల నుంచి సిటిజన్ లాగిన్ ఓపెన్ కావడం లేదు. సిటిజన్ లాగిన్ అయ్యే క్రమంలో ఫోన్‌కు వచ్చే ఓటీపీని పూర్తిగా నిలిపివేశారు. దీంతో స్లాట్ బుక్‌చేసుకునే అవకాశం లేదు. కానీ తాసీల్దార్ లాగిన్‌లో మాత్రం రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. ఇప్పటికే ధరణిలో పేమెంట్ కట్ చేసి స్లాట్ బుక్ చేయకుండా ఉండడంతో కొందరు ఆందోళనకు గురవుతున్నారు. ముందస్తు ప్రకటన లేకుండా సిటిజన్ లాగిన్ నిలిపివేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అత్యంత సులభంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతున్న ధరణి మార్పిడితో నూతనంగా వచ్చే పోర్టల్‌పై పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ధరణిలో మాడ్యూల్స్ చెకింగ్ కారణంగా సర్వర్ సమస్యతో తాత్కాలికంగా నిలిపివేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు.

# విద్యార్థుల్లో సృజనాత్మకతను గుర్తించేందుకే సైన్స్ ఫెయిర్



సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థుల ఎగ్జిబిట్స్ ప్రదర్శన

- ఎస్టీ గురుకుల రీజినల్ కోఆర్డినేటర్ లక్ష్మయ్య
- అవంతీపురం ఎస్టీ గురుకులంలో ప్రదర్శన

మిర్యాలగూడ రూరల్, జనవరి2 : మండలం పరిధిలోని అవంతీపురం గిరిజన గురుకుల పాఠశాలలో మంగళవారం ఉమ్మడి నల్లగొండ ఎస్టీ గురుకుల పాఠశాలల్లో చదివే విద్యార్థులకు సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. సుమారు 700 మంది విద్యార్థులు దీనికి హాజరయ్యారు. వివిధ ప్రాజెక్టులను రూపొందించి ప్రదర్శించారు. సైన్స్ ఫెయిర్‌ను ఎస్టీ గురుకుల పాఠశాలల రీజినల్ కోఆర్డినేటర్ కె.లక్ష్మయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఈ సైన్స్ ఫెయిర్ ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థి దశ నుంచే వారు చూపుతున్న ఆసక్తికర అంశాలను గుర్తించి ప్రోత్సహిస్తే ఆయా రంగాల్లో రాణించే అవకాశం ఉందని తెలిపారు. సైన్స్ ఫెయిర్‌తో పాటు విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రిన్సిపాల్స్, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సృజనకు పదును.. ప్రతిభకు గుర్తింపు

## పాఠ్యాంశాల్లో బోధనలో సైన్స్ టీచర్ పవిత్ర ప్రత్యేకత

## విద్యార్థి కేంద్రీకృత అభ్యసనానికి ప్రాధాన్యం



విద్యార్థులతో ప్రయోగాలు చేయిస్తున్న ఉపాధ్యాయిని పవిత్ర

- ఆమె సేవలకు వరించిన రాష్ట్రస్థాయి అవార్డులు
- రైతు, వాతావరణ సమస్యల పరిష్కారానికి కృషి
- తాజాగా 17నుంచి 20 వరకు జరిగే ఎన్ఎస్‌టీడబ్ల్యూకు ఆహ్వానం

**అన్ని వృత్తులలో కెల్లా ఆదర్శప్రాయమైనది ఉపాధ్యాయ వృత్తి. అయితే చాలా మంది దీనిని ప్రభుత్వ ఉద్యోగంగా మాత్రమే భావించి నెల సరి వేతనం కోసం బాధ్యతలు నెరవేర్చుతారు. కానీ, విద్యార్థి కేంద్రీకృత అభ్యసనానికి ప్రాధాన్యతమిస్తూ వారిలోని సృజనాత్మకతను వెలికితీసి దానికి మరింత పదును పెట్టే ప్రభుత్వ ఉపాధ్యాయులు చాలా అరుదు. అయితే విద్యార్థులకు అర్థవంతంగా బోధిస్తూ వారితో తగిన ప్రయోగాలు చేయిస్తూ వారిలోని సృజనాత్మకతను వెలికితీసి దానికి మరింత పదును పెడుతూ ఉపాధ్యాయులందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు మండలంలోని గడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న జీవశాస్త్ర ఉపాధ్యాయిని మారం పవిత్ర. విద్యార్థుల సమగ్రాభివృద్ధికి ఈమె చేస్తున్న కృషిని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపిక చేయగా, ఇప్పుడు భారత ప్రభుత్వం కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ, విజ్ఞాన భారతి ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి 20 వరకు నిర్వహించే ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌లో ఎడ్యుకేషన్ ఫర్ ఆస్పైరింగ్ ఇండియా, నేషనల్ సైన్స్ టీచర్స్ వర్క్‌షాప్‌కు ఆహ్వానం అందుకున్నారు.**

–గరిడేపల్లి, జనవరి 2

### విద్యాభ్యాసం ఇలా..

పవిత్ర స్వస్థలం మిర్యాలగూడ మండలం తడకమళ్ల గ్రామానికి చెందిన మారం శంకర్‌రెడ్డి, కళమ్మ దంపతుల కుమార్తె. ఈమె ఒకటి నుంచి ఐదో తరగతి వరకు తన అమ్మమ్మ ఊరైన వేములపల్లిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో, ఆరు, ఏడు తరగతులను తడకమళ్లలో చదివింది. ఎనిమిది నుంచి పది వరకు తిరిగి వేములపల్లి హైస్కూల్‌లో, ఇంటర్, డిగ్రీ మిర్యాలగూడలోని ప్రైవేట్ కళాశాలల్లో పూర్తి చేసింది. తదుపరి బీఈడీ సూర్యాపేట ఎంఎస్ఆర్ కళాశాలలో, ఎంఈడీ పద్మావతి యూనివర్శిటీ తిరుపతిలో, అనంతరం ఎమ్మెస్సీ(జువాలజీ) పూర్తిచేసింది. డిగ్రీ రెండో సంవత్సరం చదువుతుండగానే చివ్వెంల మండలం గుంపుల గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు నాడాల మన్మథరెడ్డితో వివాహం జరిగింది. అయినా మొక్కవోని దీక్షతో, భర్త సహకారంతో తన చదువును కొనసాగించింది.

### పవిత్ర సేవలు..

జాతీయస్థాయిలో సీఐఈటీ, ఎన్‌సీఈఆర్‌టీ యూట్యూబ్ ఛానల్ ద్వారా 2020–21 సంవత్సరానికి గానూ ఉపాధ్యాయులకు ఉపయోగపడే ఐసీటీ టూల్స్‌పై అవగాహన తరగతులు నిర్వహించారు. స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ టెక్నాలజీ(ఎస్ఐఈటీ) హైదరాబాద్ ద్వారా 14 పాఠాలు బోధించారు. ఎస్‌సీఈఆర్‌టీ తెలంగాణ పాఠ్య పుస్తకాల్లో క్యూఆర్ కోడ్ కంటెంట్ తయారీకి ఎస్‌సీఈఆర్‌టీ, దీక్ష ఆధ్వర్యంలో 60 వీడియోలు, 16 క్వచ్చన్ సెట్‌లను తయారు చేశారు. పుస్తకాల్లోని క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ఈ వీడియోలు చూడవచ్చు. ఓపెన్ టెన్త్ సైన్స్, టెక్నాలజీ, హోమ్ సైన్స్ పాఠ్యపుస్తకాల్లో పాఠ్యాంశాలు రాయడంలో పాలుపంచుకున్నారు.

### బోధనలో ప్రత్యేక విధానం..

రెండేండ్లపాటు ఎంఎస్ఆర్ డీఈడీ కళాశాలలో విద్యార్థులకు పాఠాలు బోధించిన అనంతరం 2008లో జరిగిన డీఎస్సీ ద్వారా బయోసైన్స్ ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం సాధించారు. తదుపరి ఆత్మకూర్(ఎస్) మండలం రామన్నగూడెం యూపీఎస్‌లో ఉపాధ్యాయురాలిగా విధులు చేపట్టింది. తర్వాత 2012 నుంచి 2015 వరకు గోరెంట్ల జడ్పీహెచ్ఎస్‌లో జీవశాస్త్ర ఉపాధ్యాయురాలిగా, 2015 నుంచి గడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తుంది. ప్రభుత్వ పాఠశాలలో చదువడంతో అక్కడి పిల్లలకు ఎదురయ్యే సమస్యలను అర్థం చేసుకుని వారికి అర్థవంతంగా పాఠాలు బోధించాలనే లక్ష్యంతో విద్యార్థులకు సులభతర విధానాలు అనుసరిస్తూ పాఠ్యాంశాలు బోధిస్తుంది. అలాగే విద్యార్థులతో ప్రయోగాలు చేయిస్తూ వారిలోని సృజనాత్మక ఆలోచనలకు పదునుపెడుతుంది. దాంతో విద్యార్థులు పవిత్ర సహకారంతో అనేక ప్రయోగాలు చేసి ప్రశంసలు అందుకున్నారు.

### పవిత్ర అందుకున్న అవార్డులు..

- టెక్ మహీంద్ర సైన్స్ టెక్నాలజీ ద్వారా ట్రాన్స్‌ఫార్మింగ్ ఎడ్యుకేటర్ రన్నరప్ అవార్డును అందుకున్నారు.
- లయన్స్ ఇంటర్నేషనల్ వారు ఉపాధ్యాయులకు నిర్వహించిన వీడియో కాంపిటీషన్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచి మాజీ మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా అవార్డు అందుకున్నది.
- ఫిబ్రవరి 28 నేషనల్ సైన్స్‌డే సందర్భంగా సారాబాయ్ టీచర్ సైంటిస్ట్ నేషనల్ అవార్డును జమ్ము కశ్మీర్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ రవివంకర్ శర్మ చేతుల మీదుగా అందుకున్నారు.
- అంతర్జాతీయ మహిళా దినోత్సవం 2022 సందర్భంగా అకాడమిక్ అచీవ్‌మెంట్ అవార్డ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రైడ్ విమెన్ ఆఫ్ ది ఇయర్ అవార్డును ఆన్‌లైన్‌లో అందుకున్నది.
- 2022లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డు సాధించారు.
- 2023వ సంవత్సరానికి రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డుకు ఎంపికైంది.

### విద్యార్థుల రూపకల్పనలు..

వరిపొలాల్లో రైతులు వరాలు తీయడానికి పడే కష్టానికి పరిష్కారం చూపడం, నీటిపై తేలే చెత్తను తొలగించడానికి ఉపయోగించే పరికరం, ఎకో ఫ్రెండ్లీ రాఖీల తయారీ, మొక్కలకు ఉపయోగపడే బయోటానిక్ లాంటివి ఈమె సారథ్యంలో విద్యార్థులు తయారు చేసినవే. లోహిత అనే అమ్మాయి రూపొందించిన ఎకోఫ్రెండ్లీ రాఖీలను మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, సాయిదీపక్, వెంకటేశ్ తయారు చేసిన ఫార్మర్ ఫ్రెండ్లీ సైకిల్‌ను గడ్డిపల్లి కేవీకేలో ప్రదర్శించగా మాజీ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి అభినందించారు. ఇవే కాకుండా చాలా మంది విద్యార్థులు జిల్లా, రాష్ట్రస్థాయిలో జరిగిన సైన్స్‌ఫెయిర్‌లో తమ ప్రయోగాలను ప్రదర్శించారు.

### ఐఐఎస్ఎఫ్ వర్క్‌షాప్‌కు ఎంపిక

భారత ప్రభుత్వం కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ, విజ్ఞాన భారతి ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి 20 వరకు ఫరీదాబాద్‌లో నిర్వహించే ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌లో ఎడ్యుకేషన్ ఫర్ ఆస్పైరింగ్ ఇండియా, నేషనల్ సైన్స్ టీచర్స్ వర్క్‌షాప్‌కు పవిత్ర ఎంపికైంది. ఈ మేరకు మినిస్ట్రీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్స్ నుంచి ఆహ్వానం అందుకున్నది. ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల నుంచి 300 మంది సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొంటుండగా వివిధ సైన్స్ కృత్యాలపై వారికి అవగాహన కల్పించనున్నారు.

### విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయడమే లక్ష్యం

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసి దానికి మరింత పదును పెట్టేందుకు కృషి చేస్తున్నా. నా కృషిని గుర్తించి ఇప్పటికే అనేక అవార్డులు వచ్చాయి. అవి నా బాధ్యతలను మరింత పెంచాయి. భారత ప్రభుత్వం నిర్వహించే ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌కు వివిధ కేటగిరీల్లో సృజనాత్మక ఆలోచనలకు సంబంధించి ఉపాధ్యాయులు, విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించారు. దాంతో దరఖాస్తు చేసి ఎంపికయ్యాను.

**– మారం పవిత్ర, జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు, జడ్పీహెచ్ఎస్ గడ్డిపల్లి**

